
సాక్షి
మెదక్
సోమవారం ၊ 23 ၊ డిసెంబర్ ၊ 2024



ఆత్మీయతలో స్ఫూర్తి..

ఆత్మీయతకు పేరు.. ప్రజాసేవకు స్ఫూర్తిగా నిలుస్తోంది మెదక్ సీఎస్ఐ చర్చి.

వివరాలు 8లో ▸



'మహాలక్ష్మి' మాకేది?

వెల్దుర్తి మండలంలోని పలు రూట్లలో బస్సు సౌకర్యం లేక మహిళలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

వివరాలు 9లో ▸



సంత.. సౌకర్యాల చింత

పాలకుల నిర్లక్ష్యంతో తూప్రాన్ పశువుల అంగడి అధ్వానంగా మారింది. కనీస సౌకర్యాలు కరువయ్యాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రికార్డులు ఇవ్వని అధికారులపై చర్యలు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

రేగోడ్(మెదక్): సామాజిక తనిఖీ సిబ్బందికి రికార్డులు ఇవ్వని పంచాయతీరాజ్ అధికారులపై చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అదనపు డీఆర్‌డీఓ రంగాచారి తెలిపారు. రేగోడ్ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఏర్పాటు చేశారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో రూ. 4,93,87,743 పనులు చేపట్టారు. ఆయా గ్రామ పంచాయతీల్లో కూలీలకు డబ్బుల చెల్లింపులో రూ. 42 వేల అవకతవకలు జరిగాయని, వీటిని రికవరీ చేస్తామని చెప్పారు. ఈజీఎస్ సిబ్బందికి రూ. 29 వేల జరిమానా విధించామన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా ఉపాధి పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీతారావమ్మ, ఎస్‌టీఎం దత్తు, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ జీవన్, ఏపీఓ జగన్మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సింగూరు యాసంగి ప్రణాళిక ఏదీ?

మెదక్‌మున్సిపాలిటీ: సింగూరు నుంచి యాసంగికి విడుదల చేసే నీటి ప్రణాళికను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. వనదుర్గా భవాని ప్రాజెక్టు, సింగూరు ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇంతవరకు యాసంగి నీటి ప్రణాళిక విడుదల చేయలేదన్నారు. దీంతో సుమారు 30 వేల ఎకరాల సాగు చేసే రైతులు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీటి విడుదలకు సంబంధించిన ప్రణాళికను వెంటనే విడుదల చేయాలని కోరారు.

మా సమస్యలు పరిష్కరించండి




పిల్లలతో కలిసి సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. సమ్మెలో ఉద్యోగులు తమ పిల్లలతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, రాజశేఖర్, సంపత్, రమేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం విరాళాల సేకరణ

మెదక్ కలెక్టరేట్: వచ్చే ఏడాది జనవరి 25వ తేదీ నుంచి 28 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలకు కార్మికులు విరివిగా విరాళాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం కోరారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో మహాసభల నిర్వహణ కోసం మెదక్‌లో విరాళాల సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటిసారిగా ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డి పట్టణంలో సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బసవరాజు, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



నిజాంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు నస్కల్ గ్రామ పరిధిలోని సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

చర్చి అద్భుతం

- ప్రజల ఆకలి తీర్చిన కట్టడం
- సమైక్యతకు ప్రతీక
- విశ్వాసం, పరివర్తనానికి నాంది
- కొల్చారం గురుకుల విద్యార్థులతో మాటామంతి
- ఉత్సాహంగా సాగిన గవర్నర్ పర్యటన



గవర్నర్‌కు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్



మెదక్ చర్చి ఎదుట గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మెదక్‌జోన్/చిలప్‌చెడ్(నర్సాపూర్): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన ఆదివారం జిల్లాలో ఉత్సాహంగా సాగింది. మొదట ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. చర్చి నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కరువు కాటకాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న సమయంలో చర్చి నిర్మాత చార్లెస్ వాకర్ ప్రజల ఆకలితీర్చి ఈ అద్భుత కట్టడానికి పూనుకోవడం గొప్ప విషయమన్నారు. సమాజం కలిసికట్టుగా సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు. ఇది మరో శతాబ్దం వరకు సేవ, విశ్వాసం, పరివర్తన ప్రభావానికి నాంది కావాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లలంటే చాలా ఇష్టం

కొల్చారం మండల కేంద్రంలోని గురుకుల సంక్షేమ పాఠశాల (బాలికల), కళాశాలను గవర్నర్ సందర్శించారు. ముఖాముఖి చర్చలో పాల్గొని విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కటి ప్రశ్నలు వేశారన్నారు. పిల్లలతో గడపటం, రాయడం, చదవడం తనకు ఇష్టమన్నారు. దేశ భవిష్యత్‌కు విద్యార్థులు పునాదిలాంటివారని, సమస్యలను అధిగమిస్తూ లక్ష్యాలను సాధించాలన్నారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణతో ఉంటూ భవిష్యత్‌కు మార్గనిర్దేశం చేసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలలు విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందించాలన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. దేశప్రగతి విద్యార్థుల తరగతి గదిలోనే అన్న వివేకానందుడి మాటను గుర్తు చేశారు. విద్యార్థులు ఇష్టంతో విద్యను అభ్యసించాలని సూచించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ అలుగు వర్షిణి, అదనపు కలెక్టర్ నగేష్, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని ప్రశ్నకు సమాధానం ఇస్తున్న గవర్నర్, చిత్రంలో ఎంపీ రఘునందన్, ఎమ్మెల్యే సునీతారెడ్డి

వనమంతా జనం

కిటకిటలాడిన ఏడుపాయల



ఆలయ పరిసరాల్లో భక్తుల కోలాహలం



అమ్మవారికి హారతి ఇస్తున్న పూజారి

పాపన్నపేట(మెదక్): ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఆదివారం వేలాది భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ధర్మసత్రాలు సరిపోక చెట్ల కింద సేద దీరారు. విందు చేసుకొని సాయంత్రం వరకు సరదాగా గడిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఈఓ చంద్రశేఖర్, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

రైతు సమ్మేళనానికి పటిష్ట ఏర్పాట్లు



కేవీకేలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 25వ తేదీన తునికి వద్ద గల కేవీకేకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్ర మంత్రులు రానుండడంతో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కేవీకేలో హెలిప్యాడ్, సభా ప్రాంగణ ఏర్పాట్ల పనులను పరిశీలించారు. అధికారులు, శాస్త్రవేత్తలకు పలు సూచనలు చేశారు. కేవీకే సమీపంలోని గిరిజన రైతుల పంట పొలాల్లో నాలుగు హెలిప్యాడ్‌లు ఏర్పాటుచేస్తున్నారు. పనులు పూర్తికాగానే క్యూరింగ్ చేయాలని సూచించారు. కాగా కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ రవికుమార్ కేవీకేలో జరుగుతున్న ఏర్పాట్లను వివరించారు. సేంద్రియ సాగు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు సమ్మేళనానికి సుమారు 800 మంది రైతులు రానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్‌అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేట కాషాయమయం

- నేటి నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు
- హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్, కేంద్రమంత్రి



సభావేదిక ఏర్పాట్లలో నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 43వ రాష్ట్ర మహాసభలు జిల్లా కేంద్రంలో సోమవారం నుంచి 25వరకు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ప్రధాన రహదారులలో ఎక్కడ చూసినా ఏబీవీపీ జెండాలు, వాల్‌పోస్టర్‌లు, ఫ్లెక్సీ, తోరణాలతో కాషాయమయంగా మారింది. ఈ మహాసభలకు వివిధ జిల్లాల నుంచి దాదాపు 1,500మంది కార్యకర్తలు పాల్గొననున్నారు. ఈ మహాసభలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభించి ప్రసంగించనున్నారు. 1949 జూలై 9న కేవలం ఐదు మంది విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ నేడు 50 లక్షల సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2009లో సిద్దిపేటలో ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు జరిగాయి. నాడు ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి, మాజీ కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు హాజరయ్యారు. ఇప్పుడు మళ్లీ ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలకు సిద్దిపేట వేదిక కానుంది.

ఏర్పాట్లు పూర్తి..

రాష్ట్ర మహాసభల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు. గవర్నర్‌తో పాటు, కేంద్ర మంత్రులు, ముఖ్య నాయకులు పాల్గొనే అవకాశం ఉండటంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. 1500మంది ఏబీవీపీ నాయకులతో పాటు మరో 200 మంది ముఖ్య అతిథులకు మూడు రోజుల పాటుగా భోజనాలు, వసతి సౌకర్యాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రత పరంగా పోలీస్‌లు, మున్సిపల్ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

మూడు రోజుల పాటు కార్యక్రమాలు..

- సోమవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఏబీవీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆశిష్‌చౌహాన్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు.
- మంగళవారం ఏబీవీపీ కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం వీరసావర్కర్ చౌరస్తా వద్ద భారీ సభ జరగనుంది. ఈ సభలో ముఖ్య అతిథిగా ఏబీవీపీ నేషనల్ సెక్రటరీ శ్రావణ్‌విరాజ్ హాజరై మాట్లాడనున్నారు.
- బుధవారం గౌరీజీ యువ పురస్కార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తికి రూ.50వేల ప్రైజ్‌మనీతో పాటుగా సన్మానించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయవాది పాల్గొననున్నారు. ఈ మూడు రోజుల్లో ఏదో ఒక రోజు కేంద్ర మంత్రి పాల్గొననున్నట్లు సమాచారం.

క్రీడలతో మానసికోల్లాసం

మెదక్ కలెక్టరేట్: క్రీడలు శరీర ధారుఢ్యానికి, మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతాయని జిల్లా బ్యాడ్మింటన్ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పీఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభమైంది. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటకం రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మల్లికార్జున్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పీఆర్టీయూ నాయకులు వంగ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అనంతరం జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ.. జిల్లాలో క్రీడల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధు, ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారులు వినోద్, ప్రవీణ్, చంద్రశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లికార్జున్‌గౌడ్

ఉల్లి సాగుకు రైతుల ఆసక్తి

- జిల్లాలో 620 ఎకరాల్లో సాగు
- ఆధునిక పద్ధతులతో ముందుకు



పోచారంలో రెయిన్ పైపులతో ఉల్లి సాగు

రేగోడ్(మెదక్): ఉల్లి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. యంత్రాలు వచ్చి రోజురోజుకు సాగు పద్ధతులు మారడంతో నూతన విధానం అవలంభిస్తున్నారు. రెయిన్ పైపులతో ఉల్లి పంట సాగు చేస్తూ లాభాలు అర్జిస్తున్నారు. పెట్టుబడితో పాటు పని భారం తగ్గుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 21 మండలాలు ఉండగా 620 ఎకరాల్లో రైతులు ఉల్లి పంట సాగు చేశారు. ఒక్క రేగోడ్ మండలంలోనే అత్యధికంగా 540 ఎకరాల్లో సాగు చేసి రికార్డు సృష్టించారు. రేగోడ్, మర్పల్లి, పోచారం, ప్యారారం, టి.లింగంపల్లి, సిందోల్, తాటిపల్లి, గజ్వాడ, దోసపల్లితో పాటు ఆయా తండాల్లో ఉల్లి పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఒక ఎకరాలో ఉల్లి సాగు చేసేందుకు రూ. 80 వేల పెట్టుబడి వచ్చేది. కానీ యాభై శాతం మంది రైతులు రెయిన్ పైపులను ఏర్పాటు చేసుకొని రూ. 20 వేలు పెట్టుబడి భారాన్ని తగ్గించుకుంటున్నారు. పెట్టుబడితో పాటు సమయం, కూలీలకు డబ్బులు, పని భారం తగ్గుతోందని చెబుతున్నారు. మద్దతు ధర వస్తే తమకు అధికంగా లాభాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి తగ్గింది



11 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. గతంలో ఎకరాకు రూ. 80 వేలు పెట్టుబడి వచ్చేది. రెయిన్ పైపుల ద్వారా ఎకరాకు రూ. 60 వేలు మాత్రమే వస్తుంది. పని భారం తగ్గడంతో పాటు అధిక లాభాలు పొందుతున్న.

– శేఖర్, రైతు పోచారం

రెయిన్ పైపులతో మేలు



సాగులో నూతన పద్ధతులు పాటిస్తే రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. మండలంలో సుమారు 50 శాతం మంది రైతులు రెయిన్ పైపుల ద్వారానే ఉల్లి సాగు చేస్తున్నారు. ఈ విధానం వల్ల పెట్టుబడితో పాటు పని భారం తగ్గుతోంది. మిగితా రైతులు కూడా రెయిన్ పైపులు వేసుకుంటే లాభాలు పొందవచ్చు.

– జావిద్, ఏఓ

నిలిచిన ప్రగతి.. కానరాని పురోగతి

అభివృద్ధికి నోచుకోని రామాయంపేట మున్సిపాలిటీ



రామాయంపేట వ్యూ..

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పాలనా వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 2018లో రామాయంపేట పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. తద్వారా తమ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని పట్టణ ప్రజలు సంబరపడ్డారు. అయితే రామాయంపేట మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి తప్ప మున్సిపాలిటీ అయిన తర్వాత ఎలాంటి ప్రగతికి నోచుకోలేదు. అభివృద్ధి పనులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. వాటిని పూర్తిచేయించే విషయమై ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పత్తాలేని మినీ స్టేడియం

రామాయంపేటలో మినీ స్టేడియం నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం రూ. 2.65 కోట్లు మంజూరు కాగా జాతీయ రహదారి పక్కనే స్థలం ఎంపిక చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ సదరు స్థలాన్ని చదును చేసి బిల్లులు రూ. 20 లక్షలు డ్రా చేసుకొని వెళ్లిపోయాడు.

తహసీల్దార్ కార్యాలయం శిథిలం



తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలమవడంతో దాని స్థానంలో మరో భవన నిర్మాణానికి ఆరేళ్ల క్రితం రూ. 3.5 కోట్లు మంజూరయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ భవనం స్లాబ్ వేయించి మిగితా పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రస్తుతం కార్యాలయం కొనసాగుతున్న పాత భవనం పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

నిలిచిన మార్కెట్ నిర్మాణం



రామాయంపేటలో మూడేళ్ల క్రితం వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 3 కోట్లు మంజూరు చేసింది. కాగా ఎంపీపీ కార్యాలయం ఆవరణలో పనులు ప్రారంభించి పిల్లర్లస్థాయిలోనే పనులు నిలిపివేశారు. ప్రస్తుతం మార్కెట్ ఇరుకైన ప్రదేశంలో కొనసాగుతుండగా, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో రూ. 50 లక్షలతో నిర్మించిన రైతుబజార్ సైతం నిరుపయోగంగా మారింది.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



అభివృద్ధిలో రామాయంపేట వెనుకబడిపోయింది. చాలా వరకు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌పై పట్టణ ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. మొదటగా పట్టణంలోని ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాల్సి ఉంది. ఈవిషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం.

– జితేందర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్

ట్యాంక్‌బండ్ పనులు ఏవీ?

2018లో మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం కోసం రూ. 3.20 కోట్లు మంజూరయ్యాయి. వీటితో కట్ట వెడల్పు చేయించిన అధికారులు కల్వర్టు నిర్మించి వదిలేశారు. ముఖ్యంగా పట్టణంలోని మురుగు నీటిని చెరువులోకి వదులుతుండడంతో నీరంతా కలుషితమై రంగు మారింది. చెరువులోని నీటిని శుద్ధీకరణ చేయకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డును ఆనుకొని ఉన్న చెరువులోకి తరచూ వాహనాలు దూసుకెళ్తున్నాయి. చెరువు కట్టపై కంకర పరుచుకొని కాలినడకన వెళ్లడానికి గాను స్థానికులు ఇబ్బందులపాలవుతున్నారు.



జాడలేని బస్సు డిపో

రామాయంపేటకు 15 ఏళ్ల క్రితం బస్ డిపో మంజూరు కాగా స్థానికులు విలువైన స్థలాన్ని ఆర్టీసీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. చందాలు వేసుకొని స్థలాన్ని చదును చేసి హద్దులు పాతారు. డిపో మంజూరు కాకపోవడంతో ఆ స్థలం నిరుపయోగంగా మారి ఆక్రమణకు గురవుతోంది.

క్లుప్తంగా

కల్లులో ఆల్ఫాజోలం

దుకాణంపై పోలీసుల దాడులు, నిందితుడికి రిమాండ్



మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

సిద్దిపేటఅర్బన్: ఆల్ఫాజోలంతో కల్లు తయారు చేసి విక్రయిస్తున్న దుకాణంపై దాడులు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగధాంపల్లిలో ఆల్ఫాజోలంతో కల్లు తయారు చేసి విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో టీంతో కలిసి శనివారం రాత్రి దాడులు చేశారు. కల్లు దుకాణంలో పలువురికి మూత్ర పరీక్ష చేయగా ఆమత్తుపదార్థంతో తయారు చేసిన కల్లు తాగినట్లు గుర్తించారు. దీంతో 48 కల్లు సీసాలు, 13 గ్రాముల ఆల్ఫాజోలం, నగదు రూ.8,495, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా డబ్బుల కోసం మత్తు పదార్థం కలిపి కల్లు తయారు చేస్తున్నట్టు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు



గంజాయి విక్రేతల అరెస్టు చూపుతున్న మర్కూక్ పోలీసులు

మర్కూక్(గజ్వేల్): గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కర్కపట్ల గ్రామానికి చెందిన గీర్మిల్ల సాయిమధు, సారా మహేశ్ గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు శనివారం సాయంత్రం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి గ్రామంలో రైడ్ నిర్వహించారు. గ్రామశివారులో వీరిద్దరు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి 76 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని ఆదివారం జ్యుడిషియల్ రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

మాజీ ఎంపీపీపై కేసు నమోదు

మద్దూరు(హుస్నాబాద్): మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైనట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేబర్తికి చెందిన ఎర్రబచ్చల శ్రీనివాస్ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు ఇప్పిస్తానంటే కృష్ణారెడ్డికి రూ.2.50 లక్షలు ఇచ్చాడు. రెండు సంవత్సరాలైనా దళితబంధు రాకపోవడంతో వెళ్లి డబ్బులు అడిగితే కులం పేరుతో దూషించాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మాజీ ఎంపీపీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆత్మీయతలో స్ఫూర్తి.. ప్రజాసేవలో కీర్తి

అనాథలను అక్కున చేర్చుకుంటున్న మెదక్ సీఎస్ఐ చర్చి

ఆత్మీయతకు పేరు.. ప్రజాసేవకు స్ఫూర్తిగా నిలుస్తోంది. సంధ్యా నిలయం పేరిట అభాగ్యులను అక్కున చేర్చుకుని కనురెప్పలా చూసుకుంటోంది. కులమతాలకు అతీతంగా చర్చి ఆధ్వర్యంలో విద్య, మిషన్ ఆస్పత్రి ద్వారా వైద్య సేవలను అందజేస్తోంది. చదువు కొండంత భారమైన ఈ రోజుల్లో తక్కువ ఖర్చుతో పేద కుటుంబాల్లో విద్యాజ్యోతులను వెలిగిస్తున్నది. వైద్యంలో మెరుగైన సేవలను అందజేస్తూ అందరి నోట కొనియాడుబడుతోంది. ఆసియా ఖండంలోనే అద్భుతం, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చర్చి ఆఫ్ సౌతిండియా (సీఎస్ఐ) చర్చి నిర్మించి వందేళ్లు అవుతున్న సందర్భంగా కథనం..

మెదక్‌జోన్: మెదక్ జిల్లా కేంద్రంలో ఇంగ్లాండ్‌కు చెందిన చార్లెస్ వాకర్ పాస్నెట్ 1924లో సీఎస్ఐ చర్చి నిర్మించారు. అప్పట్లో మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతుండగా తినటానికి తిండి లేక, విజృంభిస్తున్న ప్లేగు వ్యాధిలో ప్రజలు మరణిస్తున్నారు. ఈ క్రమంలో చార్లెస్ వాకర్ పాస్నెట్ ప్రజలకు పనికి ఆహారం పథకం కింద ఆకలిని తీర్చి చర్చి నిర్మించారు. మహమ్మారి నుంచి ప్రజలను రక్షించేందుకు చర్చి ప్రాంగణంలోనే మిషన్ ఆస్పత్రి ఏర్పాటు చేశారు. వైద్యులను సైతం రప్పించి ఉచితంగా వైద్యం అందజేశారు. ప్రస్తుత నిర్వాహకులు నూతన మిషన్ ఆస్పత్రి నిర్మించారు. త్వరలో వైద్యులు రాబోతున్నట్లు తెలిపారు. ఇందులో వైద్యం అతి తక్కువకు లభిస్తుందని చెబుతున్నారు.



మెదక్ చర్చి



మెదక్ చర్చి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్

భక్తిభావం.. సేవా మార్గం సొంతం	విద్య, వైద్యం సేవల్లో ఆదర్శం	వందేళ్లు అవుతున్న సందర్భంగా ప్రత్యేకం..

అతి తక్కువ ఫీజుతో...

జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్కో 10వ తరగతి విద్యార్థికి యేటా రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. కానీ చర్చి ప్రాంగణంలో నిర్మించిన సీఎస్ఐ విద్యా సంస్థలో మాత్రం ఏడాదికి కేవలం రూ. 2 వేలతో విద్యా బోధన అందిస్తున్నారు. ఇందులో వసతి గృహం సౌకర్యం సైతం ఉంది. దీనికి నెలకు రూ. 2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకుంటూ హాస్టల్లో ఉంటున్నారు.

అనాథలకు కొండంత అండగా సంధ్యా నిలయం

చర్చి ప్రాంగణంలో 1993లో సంధ్యా నిలయం నిర్మించారు. అందులో ఏ దిక్కూ మొక్కు లేని అనాథలను అక్కున చేర్చుకుంటున్నారు. వారికి ఉచితంగా భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. అనాథలు తీసుకొచ్చి దుస్తులను ఇస్తారు. ఉదయం, సాయంత్రం భోజనంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తితే చికిత్స చేయిస్తారు. ఒకవేళ ఎవరైనా మరణిస్తే వారిని ఖననం చేస్తున్నారు.



కులమతాలకతీతంగా విద్య

చర్చిని నిర్మించిన నాటి నుంచే పాఠశాల, కళాశాలలు ఏర్పాటయ్యాయి. తెలుగు/ఇంగ్లిష్ మీడియాల్లో బోధన అందిస్తున్నారు. ఇప్పటి వరకు విద్య నిరంతరంగా కొనసాగుతోంది. చర్చి వెనుక భాగంలో సీఎస్ఐ కాలేజీ ఎడ్యుకేషన్ పేరిట కులమతాలకు అతీతంగా యూకేజీ నుంచి 10వ తరగతి వరకు పేద విద్యార్థులకు విద్యాబోధన కొనసాగిస్తున్నారు. అలాగే బీఈడీ కాలేజీని సైతం నిర్వహిస్తున్నారు. గతంలో ఇంటర్ విద్య అందిస్తుండగా అనివార్య కారణాలతో ఆపివేశారు. ప్రస్తుతం వందలాది మంది విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో చదువుకుంటున్నారు.

వేతనాల చెల్లింపులు...

మెదక్ సీఎస్ఐ చర్చి డయాసీస్ పరిధి.. అమెరికా, శ్రీలంక, ఇంగ్లాండ్, దుబాయ్, తెలంగాణ, ఏపీ, కేరళ, తమిళనాడుతో పాటు మరికొంత ప్రాంతంలో విస్తరించి ఉంది. కాగా మనదేశంలోని పలు రాష్ట్రాలకు సంబంధించి ప్రధాన ఆఫీస్ సికింద్రాబాద్‌లో ఉంది. భక్తుల నుంచి వచ్చే కానుకలు, ఖర్చులు మొత్తం అక్కడి నుంచే చర్చి నిర్వాహకులు లెక్కలు చూస్తున్నారు. పాఠశాలలో, కళాశాలలో బోధించే సిబ్బందికి, చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసే గురువులకు, ఇతర సిబ్బందికి సైతం పూర్తిగా సీఎస్ఐ చర్చికి వచ్చే కానుకల ద్వారానే వేతనాలు చెల్లిస్తున్నారు.



చాలా కాలంగా ఉంటున్నాను..



నేను అనాథ నాకంటూ ఎవరూ లేరు. ఎవరో ఓ మహానుభావుడు నన్ను ఈ సంధ్యా నిలయానికి తీసుకొచ్చి వదిలేశాడు. ఆ నాటి నుంచి నాకు ఇక్కడ ఎంతో మంది నాలాంటి వారు ఆప్తులయ్యారు. ఏ లోటు లేకుండా చర్చి నిర్వాహకులు చూసుకుంటున్నారు.

లక్ష్మి, వృద్ధురాలు

బాగా చెబుతున్నారు..




నేను సీఎస్ఐ ఎడ్యుకేషన్ విద్యాసంస్థలో అతితక్కువ ఫీజుతో పదో తరగతి చదువుకుంటున్నాను. హాస్టల్, స్కూల్ ఫీజు మొత్తం ఏడాదికి రూ. 22 వేలు చెల్లించి ఇంగ్లిష్ మీడియం చదువుతున్నా. ఇదే బయట చదవాలంటే ఏడాదికి భారీగా ఖర్చు చేయాల్సిందే. చదువు బాగా చెబుతున్నారు.


గుల్షన్ టెన్త్ విద్యార్థి, పటాన్‌చెరు

124 ఏళ్ల చరిత్ర 'సీఎస్ఐ' సొంతం

దుబ్బాక: 124 సంవత్సరాల చరిత్ర పెద్దగుండవెల్లి సీఎస్ఐ చర్చి సొంతం. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లిలో 1901లో ఇంగ్లాండ్ దేశస్తులు దాన్ని నిర్మించారు. ఈ స్థానంలోనే 2001లో కొత్తగా అన్ని హంగులతో అందంగా సీఎస్ఐ చర్చిని నిర్మించారు. ఈ ప్రాంతంలోని చాలామంది పేదలకు విజ్ఞానం అందించింది. దీంతో చాలా పవిత్రంగా కొలుచుకుంటారు. ప్రతీ ఆదివారం పెద్ద ఎత్తున ప్రార్థనలు చేస్తుంటారు. యేటా క్రిస్మస్ సంబురాలు ఘనంగా జరుపుతారు.



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన చర్చి



ముస్తాబైన నర్సాపూర్ సీఎస్ఐ చర్చి

వేడుకలకు ముస్తాబు...

నర్సాపూర్ : నర్సాపూర్‌లోని పురాతన సీఎస్ఐ చర్చి క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. విద్యుత్‌కాంతులతో అలంకరించారు. దీంతో ధగధగా మెరిసిపోతోంది. 1978లో రెవరెండ్ రాబర్ట్ నథానియల్.. మిషన్ ఫీల్డ్ నిర్మించి ఫాదర్‌గా కొనసాగారు. కొంతకాలానికి నియోజకవర్గంలోని కాసాల, నాగులపల్లి, తునికి, కొడిపల్లి తదితర గ్రామాల్లోని చర్చిలను విలీనం చేసి నర్సాపూర్ పాస్టరేట్‌గా ఏర్పాటు చేశారు.

స్వాతంత్ర్యానికి ముందే ...

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం నాగులపల్లిలో స్వాతంత్ర్యం సిద్ధించక ముందే సీఎస్ఐ చర్చి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. చర్చి శిథిలావస్థకు చేరుకోగా పలుమార్లు మరమ్మతులు చేపట్టినా ఫలితం లేకపోయింది. రెండేళ్ల క్రితం మెదక్ సీఎస్ఐ ఆధ్వర్యంలో కొత్త చర్చి నిర్మించారు. ప్రస్తుతం కొత్త చర్చిలోనే భక్తులు నిత్యం ప్రార్థనలు చేసుకుంటున్నారు.



నాగులపల్లిలో కొత్తగా నిర్మించిన చర్చి ఇదే



స్వాతంత్ర్యానికి ముందున్న చర్చి

సోదరుడి ఇంటికి వెళ్తుండగా లోనంతలోకాలకు

- స్కూటీని ఢీ కొట్టిన కంటైనర్
- అక్కడికక్కడే ఇద్దరు మృతి, మరొకరికి గాయాలు



గణేశ్, నాగశ్యామల(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: స్కూటీని వెనుక నుంచి లారీ ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వినాయక రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... ఆంధ్ర రాష్ట్రం కృష్ణా జిల్లాకు చెందిన దంపతులు అశోక్ కుమార్ (32), నాగ శ్యామల (26) తొమ్మిది నెలల క్రితం నుంచి అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పేటలో నివాసముంటున్నారు. అశోక్ ఇక్కడే సివిల్ ఇంజినీర్‌గా పని చేసుకుంటున్నాడు. ఆదివారం సంగారెడ్డిలో ఉండే తన సోదరుడు ఇంటికి వెళ్లేందుకు వరసకు తమ్ముడైన గణేశ్ (17), భార్య నాగ శ్యామలతో కలిసి స్కూటీపై వెళ్తున్నాడు. ముత్తంగి సమీపంలోని ట్రెండ్స్ యూటర్న్ సమీపంలోకి రాగానే కంటైనర్ లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. కుడివైపు పడిన నాగశ్యామల, గణేశ్‌లపై నుంచి లారీ వెళ్లిపోయింది. దీంతో తీవ్రగాయాలతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఎడమవైపు పడిన అశోక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నడుచుకుంటూ వెళ్తుండగా..



బుచ్చవ్వ(ఫైల్)

గజ్వేల్‌రూరల్: మహిళను వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనగా తీవ్ర గాయాలతో మృతిచెందింది. ఈ సంఘటన గజ్వేల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దౌల్తాబాద్ మండలం సూరంపల్లికి చెందిన బుచ్చవ్వ(60) అనారోగ్యంగా ఉండడంతో వైద్యం కోసం గజ్వేల్‌కు వెళ్లింది. ఇదే సమయంలో దుబ్బాక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జేబీఎస్ నుంచి దుబ్బాకకు వెళ్లేందుకు గజ్వేల్‌కు వచ్చింది. ఇందిరా పార్కు చౌరస్తా వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంగా యూటర్న్ తీసుకుంటుండడంతో నడుచుకుంటూ వెళ్తున్న బుచ్చవ్వను బస్సు ఢీకొంది. ఈ ఘటనలో వెనక చక్రాల కింద పడడంతో కాళ్లు విరిగాయి. స్థానికులు క్షతగాత్రురాలిని గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు బాధిత కుటుంబీకులు మెరుగైన చికిత్స కోసం గాంధీకి తీసుకువెళ్ళగా చికిత్స పొందుతూ మృతిచెందింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందర వందరగా పడి ఉన్న వస్తువులు, తెరిచి ఉన్న బీరువా

చేర్యాల(సిద్దిపేట): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన చేర్యాల మండలం ఆకునూరులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్ఐ పి.నీరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంతపురి యాదయ్య శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ఆదివారం ఉదయం తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన పక్కింటి వారు ఇచ్చిన సమాచారం మేరకు తిరిగొచ్చాడు. ఇంట్లోని వస్తువులు చిందర వందరగా పడి ఉండడమే కాకుండా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. ఈ విషయమై పోలీసులకు సమాచారమిచ్చాడు. సంఘటన స్థలానికి వెళ్లిన వారు.. క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. చోరీ ఘటనలో నాలుగు తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.5వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతో రైతు, మద్యానికి బానిసై మరొకరు, కడుపునొప్పి తాళలేక మహిళ, వరకట్నం వేధింపులతో వివాహిత బలవన్మరణాలకు పాల్పడ్డారు.



ప్రవీణ్ (ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): అప్పులబాధ భరించలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హవేళిఘణాపూర్ మండలంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కూచన్‌పల్లికి చెందిన ఈర్ల ప్రవీణ్(36), భార్య మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తనకున్న బీడు పొలాన్ని డోజర్లతో చదును చేయించాడు. అందుకు గాను రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. అందులో వంట సాగు చేసినా దిగుబడి రాక అప్పులు ఎక్కువ కావడంతో పాటు వడ్డీ చెల్లించలేని పరిస్థితిలో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి గ్రామ శివారులో ఉన్న పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని శనివారం రాత్రి కుటుంబీకులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహం తరలించారు.

కడుపునొప్పి భరించలేక ..

సిద్దిపేటకమాన్: కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటుచేసుకుంది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షమీమ్ బేగం (36) ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ తన కుటుంబంతో కలిసి సిద్దిపేట డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాసం ఉంటుంది. భర్త ఎండీ ఖయ్యూం హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్. దంపతుల పెద్ద కుమారుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. చిన్న కుమారుడితో కలిసి బేగం స్థానికంగా నివాసం ఉంటుంది. ఏడాది క్రితం ఆమెకు గాల్ బ్లాడర్‌లో రాళ్లు రావడంతో ఆపరేషన్ నిర్వహించారు. అప్పుడప్పుడు కడుపునొప్పితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపేది. ఆమె కడుపునొప్పి భరించలేక ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై షమీమ్ తండ్రి సద్దర్‌మియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగొద్దని నిలదీయడంతో వృద్ధుడు...

తొగుట(దుబ్బాక): మద్యానికి బానిసైన వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి మదిర వడ్డెర కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు కథనం మేరకు వివరాలు... గ్రామానికి చెందిన బోదాసు మల్లయ్య (59) మద్యానికి బానిసై నిత్యం మద్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్నారు. శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చాడు. దీంతో రోజూ మద్యం తాగితే సంసారం ఎలా సాగుతుందంటూ కుటుంబీకులు నిలదీశారు. దీంతో సిద్దిపేట మండలం తడ్కపల్లిలోని మనవడి వద్దకు వెళ్తున్నానంటూ వెళ్లాడు. గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని తనువుచాలించాడు. మల్లయ్య కుమారుడు బోదాసు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వరకట్నం వేధింపులతో వివాహిత ..



అశ్విని

బెజ్జంకి(సిద్దిపేట): వివాహిత వరకట్నం వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని దేవక్కపల్లెలో జరిగింది. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరికి చెందిన కెక్కర్ల చంద్రయ్య కుమార్తె అశ్వినీకి మండలంలోని దేవక్కపల్లెకి చెందిన వద్లకొండ శ్రీకాంత్‌తో 2020లో వివాహం జరిగింది. అప్పుడే అన్ని లాంఛనాలు అందజేశారు. అప్పటి నుంచి అతను ఏపని చేయకుండా తిరుగుతున్నాడు. ఖర్చులకు సైతం డబ్బులు తేవాలని భార్యను వేధించేవాడు. వాటిని భరించలేక మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దంపతులకు కుమారుడు ఉన్నాడు. అశ్విని తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపులపై కేసు చేశామని ఎస్ఐ తెలిపారు. కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. సంఘటనా స్థలాన్ని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జట్ల ఎంపిక



ఎంపికైన జట్ల క్రీడాకారులతో పీడీలు, అడహక్ కమిటీ ప్రతినిధులు

నర్సాపూర్: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేశామని జిల్లా ఖోఖో అడహక్ కమిటీ కన్వీనర్ మహేందర్‌రావు, సభ్యులు పోచప్ప, నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక అల్లూరి సీతారామరాజు గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కాలేజీ ఆవరణలో ఎంపికలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సీనియర్ ఖోఖో కోసం మహిళలు, పురుషుల జట్లకు 15 మంది చొప్పున ఆటగాళ్లను ఎంపిక చేశామని చెప్పారు. జనవరి 8 నుంచి 10 వరకు వరంగల్ జిల్లా గీసుగొండలో జరిగే 57వ రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ జట్లు పాల్గొంటాయని తెలిపారు.